





Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక








మంగళవారం 25-11-2025 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :175 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్


## ‘ప్రత్యేక పరిస్థితుల్లో జరిగిన దుర్ఘటన’..

### తేజస్ ప్రమాదంపై హిందుస్థాన్ ఏరోనాటిక్స్




2లో

## ‘ఎస్ఐఆర్’ ఎఫెక్ట్..!

### బెంగాల్ నుంచి బంగ్లాదేశీయుల ఇంటిబాట



‘హకీంపుర్’.. పశ్చిమ బెంగాల్‌లో భారత్- బంగ్లాదేశ్ సరిహద్దులోని ఈ ప్రాంతంలో చరిత్ర పునరావృతమవుతున్నట్లు కనిపిస్తోంది.

2లో


## కాలుష్యాన్ని నెట్ జీరో స్థాయికి తగ్గించాలి: సీఎం చంద్రబాబు

- ప్లాస్టిక్ వ్యర్థాల డిస్పోజ్‌కు విధాన నిర్ణయం
- పొల్యూషన్ కంట్రోల్ బోర్డుపై సీఎం సమీక్ష
- బయో వ్యర్థాలను 48 గంటల్లోనే డిస్పోజ్ చేయాలి
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అనుమతులివ్వాలి
- ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్‌కు టెక్నాలజీ వాడాలి



## మ్యాజిక్ డ్రెయిన్ పనితీరుపై పవన్ కళ్యాణ్ సంతృప్తి

- ఐ.ఎస్. జగన్నాథపురంలో పరిశీలన
- రూ.77 వేల వ్యయంతో మూడు రోజుల్లో పూర్తి
- రాష్ట్రవ్యాప్తంగా అమలుకు దిశానిర్దేశం
- తక్కువ ఖర్చుతో మురుగు సమస్యకు పరిష్కారం
- భూగర్భ జలాల పెరుగుదలకు దోహదం



ఏలూరు జిల్లా పర్యటనలో భాగంగా ఐ.ఎస్. జగన్నాథపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్‌ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పరిశీలించారు. డ్రెయిన్ నిర్మాణంలో ఎన్ని పొరలు ఉంటాయి, ఎంత లోతులో నిర్మించారు తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న ఇంటి నుంచి ఒక బిందె నీటిని వంపి ఆయన పనితీరుని పరిశీలించారు.
రూ. 77,173 నిర్మాణ వ్యయంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కేవలం మూడు రోజుల్లో ఈ డ్రెయిన్ నిర్మాణం పూర్తి చేసినట్టు అధికారులు తెలిపారు.

2లో

## అర్ధరాత్రి సీపీ సజ్జనార్ పెట్రోలింగ్.. రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి..



హైదరాబాద్: నగర సీపీ వీసీ సజ్జనార్ ఆదివారం అర్ధరాత్రి పెట్రోలింగ్ చేశారు. లంగర్ హౌస్, టోలిచౌకి ప్రాంతాల్లో అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారుజాము 3 గంటల వరకు రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి ఆకస్మిక తనిఖీలు చేశారు.

2లో

## అన్ని రంగాల్లో పిల్లలు రాణించాలి

- చదువుతోనే ఉజ్వల భవిష్యత్
- కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్
- తెలంగాణ నోయిడాగా కొడంగల్ అభివృద్ధి
- అభివృద్ధికి ప్రజలంతా అండగా నిలవాలి
- గతంలో ఎవరు సిఎం ఉన్నా కొడంగల్‌ను పట్టించుకోలే
- అక్కడి అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్ కు శ్రీకారం
- సొంత నియోజకవర్గం పర్యటనలో సిఎం రేవంత్ రెడ్డి



మన పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని, అత్యున్నత స్థానంలో ఉండాలన్నదే తన ఆకాంక్ష అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ నోయిడాగా కొడంగల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతాం అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఉన్నా ఇటువైపు చూడలేదని, అందుకే మీరిచ్చిన ఈ అవకాశంతో కొడంగల్‌ను తీర్చిదిద్దబోతున్నానని అన్నారు. అభివృద్ధితో వెళతున్న తనకు మీ ఆశర్వాదంతో మద్దతు పలకాలన్నారు. రాబోయే కొన్ని నెలల్లో కొడంగల్ రైల్వే పనులు ప్రారంభ మవుతాయి. నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయబోతున్నాం అని అన్నారు. కొడంగల్‌లో ఏ విద్యార్థీ ఆకలితో ఉండకూడదన్న లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 28 వేల మందికి ఉదయం అల్పాహారం అందిస్తున్నామన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో 5 వేల మంది విద్యార్థులు పెరిగారని చెప్పారు. సొంత నియోజకవర్గం కొడంగల్ పర్యటనకు వెళ్లిన రేవంత్ రెడ్డి.. అక్కడి అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌ను పరిశీలించారు. మిడ్‌డే మీల్స్ కిచెన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.



మిగతాది 2లో

## హైదరాబాద్‌లో భూముల అమ్మకంపై ప్రభుత్వాన్ని నిలదీయండి:

### కార్పొరేటర్లతో కేటీఆర్



హైదరాబాద్: పార్టీ వెంటే ఉన్న ప్రతి కార్పొరేటర్‌కు భవిష్యత్తులో మరిన్ని పదవులు వస్తాయని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో ఆయన సమావేశమయ్యారు. బల్దియా సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు.

## జీవితంలో అవమానాలు సహజం..

### లక్ష్యంతో పని చేస్తేనే విజయం: లోకేశ్

- విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘విలువల విద్య’ సదస్సులో చాగంటితో కలిసి లోకేశ్ పాల్గొన్నారు.
- పిల్లల్ని సరైన మార్గంలో పెట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని స్పష్టం చేశారు.
- “పిల్లల్లో మార్పు ఇంటి నుంచే మొదలవ్వాలి.





2లో

## అన్నదాత అభివృద్ధికి పంచసూత్రాలు: అచ్చెన్నాయుడు

- ఘంటశాలలో ‘రైతన్న మీకోసం’ ప్రారంభం
- ప్రకృతి సేద్యం, టెక్నాలజీ వినియోగం కీలకం
- ప్రతి రైతు కుటుంబం అభివృద్ధి చెందాలి
- యాంత్రికరణే రైతు భవిష్యత్ ఆయుధం
- జగన్ విమర్శలు సిగ్గుచేటు: మంత్రి



# సంపాదకీయం

## ఎఐ ఆర్భాటం..ఉద్యోగాల చెలగాటం

ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఎ.ఐ) అనే కృత్రిమ మేధ చుట్టూ పరిభ్రమిస్తున్న ప్రపంచ ఆర్థిక సాంకేతిక చర్చ ఇప్పుడు భారత దేశాన్నీ తెలుగు రాష్ట్రాలనూ తాకింది. విశాఖలో గూగుల్ అదానీ ఎ.ఐ డేటా సెంటర్ స్థాపనకు ఒప్పందంతో ఈ చర్చ మరింత వేడిపుంజుకుంది. 1500 కోట్ల డాలర్ల పెట్టుబడితో రెండు లక్షల ఉద్యోగాలు వస్తాయనే ప్రచారంపైనా చాలా వాదోపవాదాలు నడిచాయి. ఈ డేటా సెంటర్ల భూసేకరణ, పర్యావరణపై ప్రభావంపైన కూడా భిన్నాభిప్రాయాలు ఇంకా సాగుతున్నాయి కూడా. ఈ క్రమంలో విశాఖ డేటా సెంటర్ క్రెడిట్ వార్ పరాకాష్టకు చేరి మేమంటే మేమని వైసిపి, టిడిపి లు ప్రచారం హోరెత్తించాయి. ఆ రాజకీయాలు అలా వుంచితే ఈ సమయంలో ప్రపంచవ్యాపితంగా ఇదే విధంగా ఎ.ఐ పై చర్చలు సాగుతున్నాయి. ఉత్పత్తి సాధనాలు సాంకేతిక పరిజ్ఞానం ఆధునీకరణలో ఎప్పుడూ ముందుకు పోవలసిందే. కానీ అదే సమయంలో ఉద్యోగాలపై, ఉత్పత్తిపై దాని ప్రభావం ఏమిటి అనేది కూడా తప్పక అవగాహన పెంచుకోవలసిన విషయం. ఇతరులెవరో కాకుండా నేరుగా గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థల సిఇవోలు, ప్రఖ్యాత ఆర్థికవేత్తలు ఈ విషయంలో ఏం చెప్పారో తెలుసుకోవడం కన్నా ఇందుకు మెరుగైన మార్గం వుండదు.

**సిఇవోల సంకేతాలు**

గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ సిఇవో సుందర్ పిచారు మొన్న బుధవారం మాట్లాడుతూ ప్రస్తుతం ఎ.ఐ కి సంబంధించి సాగుతున్న హడావుడిలో హేతుబద్ధత కొంత లోపిస్తున్నదని వ్యాఖ్యానించారు. ప్రపంచ వ్యాపితంగా పెద్ద కంపెనీలు ఎ.ఐ వ్యవస్థలకు మారడం ద్వారా ఖర్చులు తగ్గించుకునేందుకు, లాభాలు పండించుకోవడానికి భారీ బడ్జెట్లు కేటాయించడం జరుగుతున్నది. గూగుల్ జెమినీ, చాట్‌బాట్, ఎ.ఐ చిప్స్ తీసుకొచ్చింది. ఓపెన్ ఎ.ఐ మైక్రోసాఫ్ట్ మధ్య పోటీ కూడా సాగుతున్నది. గత ఏడు నెలల్లో ఆల్ఫాబెట్ షేర్ల విలువ మూడున్నర లక్షల కోట్ల డాలర్లు పెరగడానికి ఎ.ఐ వెల్లువ కారణమైంది. ఎ.ఐ బుడగకు కారణమైన సంక్లిష్ట ఆర్థిక ఇంజనీరింగ్ దీని వెనక వుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎ.ఐ బుడగ పగిలిపోతే గూగుల్ తట్టుకోగలదా అని సుందర్ పిచారుని ప్రశ్నించినపుడు మాతో సహా ఏ కంపెనీ కూడా ఈ ముప్పు తప్పించుకోజాలదని సమాధానమిచ్చారు. గతంలో వచ్చిన ఇంటర్నెట్ వ్యవహారాన్ని ఇందుకు ఉదాహరణగా చూపారాయన. ఇంటర్నెట్ వచ్చినపుడు కూడా ఇలాగే అతిగా పెట్టుబడులు పెట్టారు. అయితే అది ఇంటర్నెట్ నిజంగా అంత బలమైందా అని మాలాంటివాళ్లం ఎప్పుడూ ప్రశ్నించలేకపోయాము. అప్పుడు జరిగినట్టే ఇప్పుడూ జరుగుతుంది. ఇందులో కొంత హేతుబద్ధత వుంది. ఇలాంటి సమయాల్లో హేతురాహిత్యం కూడా కొంత వుంటుందని సుందర్ పిచారు తేల్చిచెప్పేశారు.

పిచారుతో పాటు ఓపెన్ ఎ.ఐ సిఇవో శాం ఆల్మన్ కూడా ఎ.ఐ సాంకేతిక వ్యవస్థలో కొన్ని అంశాలు నిజంగా గాలిబుడగ స్వభావంతో వున్నాయని వ్యాఖ్యానించారు. దాని గురించి చెప్పడం చాలా ఆసక్తిగానూ వుంటుందన్నారు. అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్ మాట్లాడుతూ దీనివల్ల ఎ.ఐ ప్రభావంతో పారిశ్రామిక బుడగ కూడా వస్తుందని చెబుతూ ఈ రెండింటికీ మధ్య తేడాను వివరించే ప్రయత్నం చేశారు. ”బ్యాంకింగ్ బుడగ, బ్యాంకింగ్ వ్యవస్థలో సంక్షోభం%ౌ% 2008లో అది ఎంతో దుష్ప్రభావం చూపింది. సమాజం అలాంటి వాటిని రాకుండా చేయాలని కోరుకుంది. పరిశ్రమలకు సంబంధించిన బుడగల సంగతీ అంతే. అయితే మంచి బుడగలూ వుంటాయి. అంతా అయిపోయాక చూస్తే వాటివల్ల కలిగిన ఫలితాలేమిటో ఎవరు విజేతలో వాటి వల్ల ఎవరు ప్రయోజనం పొందారో అర్థమవుతుంది” అంటూ నర్మగర్భంగా మాట్లాడారు.

మైక్రోసాఫ్ట్ సిఇవో సత్య నాదెళ్ల కూడా ఈ సమయంలో ఇండియా లోనే పర్యటిస్తున్నారు. ఎ.ఐ శకంలో తమ వాణిజ్య నమూనా పూర్తిగా మరోసారి ఆలోచించుకోవలసి వుంటుందని ఆయనన్నారు. పదిహేనేళ్ల కిందట క్లౌడ్ కంప్యూటింగ్‌కు మారినప్పుడు తమకు పనిచేసి పెట్టిన నిపుణుడు రోల్ఫ్ హార్మ్‌నే మళ్లీ ఈ దశలోనూ పరివర్తనకు తోడ్పడాలని తెచ్చుకున్నారు. 2025 జులైలో తమ ఉద్యోగులకు దీనిపై లేఖ రాసిన సత్య నాదెళ్ల అనిశ్చిత పరిస్థితి, గజిబిజి లో లే ఆఫ్‌లకు దిగాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పరిశ్రమలో కావలసింది విజయమేనంటూ వినియోగదారుల కొత్త అవసరాలను అందుకోవడం కోసం ఇప్పుడున్న వాణిజ్య నమూనా మార్పుతో కొత్త తరహా ఉద్యోగాలు సృష్టించాల్సి వస్తుందన్నారు. దీర్ఘకాలంలో మైక్రోసాఫ్ట్ మనుగడ కోసం ఎంతో ఆందోళన సత్య నాదెళ్ల లేఖలో ప్రతిబింబించిందని మీడియా వ్యాఖ్యానించింది. మినీ కంప్యూటర్లను ఒకప్పుడు పాలించిన డిజిటల్ ఎక్విప్‌మెంట్ కార్పొరేషన్ కొన్ని వ్యూహాత్మక తప్పిదాలు చేసిన కారణంగా మటుమాయమైపోయిన ఉదాహరణ తనను వెంటాడుతున్నదని పేర్కొన్నారు. మనం సృష్టించిన కొన్ని అతి పెద్ద వ్యాపార వ్యవస్థలు మనం ముందుకు పోతున్నకొద్దీ కొరగానివిగా మారిపోవచ్చని హెచ్చరించారు. మైక్రోసాఫ్ట్ అనేది వినియోగదారీ పరికరాలను సరఫరా చేసే పరిస్థితి నుంచి ఎ.ఐ ఏజంట్లకు అంటే యంత్రాలకు మౌలిక సదుపాయాల కల్పనలో సహకరించే పాత్రలోకి మారిపోవచ్చని సూచించారు. వాస్తవానికి సత్య నాదెళ్ల స్వయంగా తన గత పాత్ర నుంచి మారిపోగా మరొకరిని తీసుకొచ్చారు. సుందర్ పిచారు మాట్లాడుతూ ఎ.ఐ అనేది సిఇవో లను కూడా వదలిపెట్టబోదని చెప్పిన దాని ప్రభావం ఇక్కడ మనకు కనిపిస్తుంది. సత్య నాదెళ్ల మాటలు అతి తీవ్ర హెచ్చరిక అని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్వయంగా నిర్వహించిన ఐ.టి కంపెనీల అధినేతల సమావేశంలోనే ఎ.ఐ పై పెట్టుబడులు పెంచాలని నిర్ణయానికి వచ్చిన విషయం గతంలో చెప్పుకున్నాం. మీరు ఇప్పుడు ఏ పత్రిక చూసినా డేటా సెంటర్‌పై లేదా ఎ.ఐ పై ఇంత పెట్టుబడి పెట్టాలని నిర్ణయించినట్టు ప్రకటనలే కనిపిస్తున్నాయి. ఉదాహరణకు టి.సి.ఎస్ తో కలసి డేటా సెంటర్ ఏర్పాటు చేయడానికి టిపిజి ఒప్పందం చేసుకోగా అందుకు 200 కోట్ల డాలర్లు పెట్టుబడి పెడతామన్నారు. 1.2 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటరర్ నిర్మాణానికి దాదాపు 700 కోట్ల డాలర్లు పెట్టుబడి పెడతామని టి.సి.ఎస్ ప్రకటించింది. సత్య నాదెళ్ల స్వయంగా కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ తదితరులను కలుసుకున్నారు.

**లేఆఫ్‌లు..తొలగింపులు..**

అమెరికాలో ఇప్పుడు వరస లేఆఫ్‌ల కాలం నడుస్తున్నది. ట్రంప్ టారిఫ్‌ల వల్ల నిర్వహణ వ్యయం పెరిగిపోయిందని అనేక కంపెనీలు చెబుతున్నాయి. ఇంకొన్ని ఎ.ఐ కి అనుగుణంగా మారడం వంటి కారణాలు చూపిస్తున్నాయి. 43 రోజుల షట్‌డౌన్ దీనికి ఆజ్యం పోసింది. 4.4 శాతం నిరుద్యోగం పెరిగింది. మహిళలలో 7.5 శాతం నిరుద్యోగం పెరిగింది. ఒక్క ఆగష్టు నెలలోనే 4000 ఉద్యోగాలు వూడాయి. నవంబరులో వెరిజోనా కంపెనీ 13 వేల మందినీ, జనరల్ మోటర్స్ 1700 మందినీ, పారమౌంట్ 2 వేల మందిని (పది శాతం సిబ్బందిని), అమెజాన్ 14 వేల మందినీ తొలగిస్తున్నట్టు ప్రకటించాయి. మొత్తం 30 వేల కార్పొరేట్ ఉద్యోగాలు కత్తిరిస్తున్నట్టు అమెజాన్ వెల్లడించింది. యుపిఎస్ 48 వేల ఉద్యోగాల కోత ప్రకటించింది. నెస్లె ప్రపంచవ్యాపితంగా 16 వేల మందిని తొలిగిస్తానని చెబితే డేనిష్ ఫార్మా కంపెనీ నోవో నోర్డిక్ 9 వేల ఉద్యోగాలకు ఎసరుపెట్టింది. ఇంటెల్ ఇప్పుడున్న 99,500 మంది ఉద్యోగుల సంఖ్యను 75 వేలకు తీసుకురానున్నట్టు సిఇవో లిప్ బూ టాన్ వెల్లడించారు. మైక్రోసాఫ్ట్ 6 వేల మందినీ, ప్రాక్టర్ అండ్ గాంబిల్ 7 వేల మందినీ తొలగిస్తామని ప్రకటించాయి.

## అర్ధరాత్రి సీపీ సజ్జనార్ పెట్రోలింగ్.. రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి..

మొదటి పేజీ తరువాయి

వారి నేర చరిత్ర, జీవనశైలిపై ఆరా తీశారు. నేర ప్రవృత్తి మానుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో తెరిచి ఉన్న దుకాణాల నిర్వాహకులను సీపీ హెచ్చరించారు. పెట్రోలింగ్ సిబ్బంది అప్రమత్తతను తనిఖీ చేసి గస్తీ పాయింట్లు, స్పందన వేగంపై సమగ్ర పరిశీలన చేశారు. నగర భద్రతపై కఠిన పర్యవేక్షణ కొనసాగుతుందని వెల్లడించారు.

## జీవితంలో అవమానాలు సహజం..

మొదటి పేజీ తరువాయి

విజయవాడ: విద్యార్థుల భవిష్యత్ కోసమే ప్రవచనకర్త, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు రూపొందించిన పుస్తకాలు అందిస్తున్నామని మంత్రి లోకేశ్ అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విలువల విద్య' సదస్సులో చాగంటితో కలిసి లోకేశ్ పాల్గొన్నారు. పిల్లల్ని సరైన మార్గంలో పెట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని స్పష్టం చేశారు."పిల్లల్లో మార్పు ఇంటి నుంచే మొదలవ్వాలి. మహిళలను గౌరవించినప్పుడే సమాజం బాగుంటుంది. సినిమాల్లోనే కాకుండా వెబ్‌సిరీస్‌ల్లోనూ మహిళలను అగౌరవంగా చూపించకూడదు. మార్కులు తక్కువ వచ్చాయని ఆత్మహత్యలు సరికాదు. జీవితంలో అవమానాలు సహజం. లక్ష్యంతో పని చేస్తే విజయం సాధించగలం. టీచర్ల సమస్యలను చాలా వరకు పరిష్కరించాం. విద్యా విధానంలో మార్పులు తీసుకొస్తున్నాం" అని లోకేశ్ అన్నారు.

## మ్యాజిక్ డ్రెయిన్ పనితీరుపై పవన్ కళ్యాణ్ సంతృప్తి

మొదటి పేజీ తరువాయి



పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పల్లెల్లో మురుగు నీటి నిర్వహణ మెరుగుపర్చేందుకు ఈ మ్యాజిక్ డ్రెయిన్ వ్యవస్థను తీసుకువచ్చారు. మలి విడత పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఐ.ఎస్. జగన్నాథపురంలో నిర్మించిన డ్రెయిన్‌ను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి దాని పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మిగతా గ్రామాల్లో కూడా దశలవారీగా దీనిని అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఇది మురుగునీటి సమస్యలకు తక్కువ ఖర్చుతో మెరుగైన పరిష్కారం చూపుతుంది. సిమెంట్ డ్రెయిన్ కిలోమీటరుకు రూ.50 లక్షల ఖర్చుతో పోలిస్తే, మ్యాజిక్ డ్రెయిన్ 1 కి.మీ. ఖర్చు రూ.7.5 లక్షలు మాత్రమే. మూడు పొరల ఫిల్టర్ వ్యవస్థ ద్వారా మురుగునీరు భూమిలో ఇంకిపోయి భూగర్భ జలాల మట్టం పెరుగుతుంది. పుణ్యక్షేత్రం కావడంతో ఐ.ఎస్. జగన్నాథపురంలో పనులు ప్రాధాన్యంగా చేపట్టారు, ద్వారక తిరుమల మండలంలోని అన్ని గ్రామాల్లో కూడా అమలు జరుగుతోంది.

## అన్నదాత అభివృద్ధికి పంచసూత్రాలు: అచ్చెన్నాయుడు

మొదటి పేజీ తరువాయి



రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు, అన్నదాతకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం పటిష్టమైన పంచసూత్ర ప్రణాళికతో ముందుకు వెళుతోందని వ్యవశాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. సోమవారం కృష్ణ జిల్లా, ఆవనిగడ్డ నియోజకవర్గంలోని ఘంటశాల గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని మంత్రి అచ్చెన్నాయుడు, ఆవనిగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలసి ప్రారంభించారు.

పంచసూత్రాలు – నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అనే అంశాలతో ఈ విధానాన్ని చేపట్టామన్నారు. వ్యవసాయ రంగంలో పెనుమార్పులు తీసుకురావడం ద్వారా రైతుల సాగును లాభసాటి చేసేందుకు ప్రభుత్వం ఫోకస్ పెట్టిందని తెలిపారు. ప్రతి రైతు కుటుంబాన్ని ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్లడం ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మంత్రి అన్నారు.

పంచసూత్రాలను ప్రతి రైతు ఇంటికి వెళ్లి, కనీసం 20 నిమిషాల పాటు వివరించేందుకు పెద్దస్థాయి కార్యక్రమం చేపట్టామని మంత్రి వెల్లడించారు. నందమూరి తారక రామారావు, సీఎం చంద్రబాబుల హయాంలో నీటి ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని, వారి కృషి వలనే కృష్ణా డెల్టాకు నీటి సమస్య రాలేదని వివరించారు. యాంత్రికరణ, అగ్రిటెక్ పరికరాలు రైతు సేవ కేంద్రాలలో అందుబాటులో ఉంచేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని, డ్రోన్ల ద్వారా మందు పిచికారీ చేయడం, ఏ ఎకరాలో ఏ వ్యాధి వచ్చిందో గుర్తించడం వంటి అత్యాధునిక విధానాలు రైతు ఖర్చులు తగ్గించి, దిగుబడిని పెంచే విధానాలు అని అన్నారు.

జగన్ విమర్శలపై మండిపాటు

రైతన్న మీకోసం కార్యక్రమం రైతులను రోడ్డు మీద పడేస్తుంది అని పులివెందుల ఎమ్మెల్యే జగన్ అనడం సిగ్గుచేటని మంత్రి మండిపడ్డారు. ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండి వ్యవసాయాన్ని గాలికి వదిలేసిన వ్యక్తి కూటమి ప్రభుత్వంపై మాట్లాడటం బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక దిగుబడులు వచ్చినా ధరలు రాక రైతులకి జరిగిన ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అండగా నిలిచిందని, బడ్జెట్‌లో 300 కోట్లు పెట్టినా, దాదాపు 1000 కోట్లు ఖర్చు చేసి రైతు పంటలు కొనుగోలు చేసామన్న విషయాన్ని జగన్ గుర్తుపెట్టుకోవాలని అన్నారు. వ్యవసాయ శాఖ అభివృద్ధిపై జగన్ ఓపెన్ డిబేట్కు రావాలని మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు.

## 'ప్రత్యేక పరిస్థితుల్లో జరిగిన దుర్ఘటన'..

మొదటి పేజీ తరువాయి

బెంగళూరు: హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తయారు చేసిన తేజస్ యుద్ధ విమానం దుబాయ్ ఎయిర్ షోలో శుక్రవారం కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో పైలట్ వింగ్ కమాండర్ నమాంశ్ స్యాల్ మృతిచెందారు. ఆయన మరణం పట్ల కంపెనీ తీవ్ర విచారణ వ్యక్తం చేసింది. మరోవైపు ఈ ఘటనతో సోమవారం నాటి ట్రేడింగ్‌లో హెచ్ఏఎల్ షేర్లు భారీగా పడిపోయాయి. దీంతో ప్రమాదాన్ని ప్రత్యేక పరిస్థితుల్లో సంభవించిన దుర్ఘటనగా కంపెనీ అభివర్ణించింది.

కంపెనీ షేర్లు సోమవారం ఉదయం ఎనిమిది శాతానికి పైగా పడిపోయాయి. దుబాయ్ ఎయిర్ షోలో జరిగిన ఈ సంఘటనను 'అసాధారణ పరిస్థితుల వల్ల తలెత్తిన ప్రత్యేక దుర్ఘటన'గా హెచ్ఏఎల్ పేర్కొంది. ఈ ప్రమాదం తమ సంస్థ వ్యాపార కార్యకలాపాలు, ఆర్థిక పనితీరు లేదా భవిష్యత్తు డెలివరీలపై ఎలాంటి ప్రభావం చూపదని హామీ ఇచ్చింది. అయినప్పటికీ.. బీఎస్ఈలో షేరు ఓ దశలో దాదాపు 8 శాతం తగ్గి రూ. 4,205 వద్ద ట్రేడైంది.

ప్రమాదంపై విచారణ జరుపుతున్న ఏజెన్సీలకు తమ పూర్తి సహకారం ఉంటుందని హెచ్ఏఎల్ తెలిపింది. అన్ని రకాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చింది. ఈ విషయంలో వాటాదారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందజేస్తామని పేర్కొంది.

ఈ తేజస్ యుద్ధ విమానం తమిళనాడులోని సూలూరు స్క్వాడ్రన్‌కు చెందినది. సుమారు ఎనిమిది నిమిషాలు విన్యాసాలు చేసిన తర్వాత ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవడానికి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విచారణకు ఆదేశించింది.

## కాలుష్యాన్ని నెట్ జీరో స్థాయికి తగ్గించాలి: సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

అన్ని రకాల ప్లాస్టిక్ వ్యర్థాలను డిస్పోజ్ చేసేందుకు త్వరలో ఓ విధాన నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డుతో సహా వివిధ శాఖల అధికారులతో సోమవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో కాలుష్యాన్ని నెట్ జీరో స్థాయికి తగ్గించాలని, గాలి, నీరు, ఇండస్ట్రియల్ వేస్ట్, బయో వేస్ట్, ప్లాస్టిక్ వేస్ట్ వంటి వాటిల్లో అధ్యయనం కోసం టెక్నాలజీని వినియోగించాలని సూచించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని, వివిధ వ్యర్థాలను సర్క్యులర్ ఎకానమీ విధానానికి అనుసంధానం చేయాలని అన్నారు. మొత్తంగా 15,526 హెల్త్ కేర్ ఫెసిలిటీస్ ద్వారా వచ్చే బయో వ్యర్థాలను 48 గంటల్లోగా డిస్పోజ్ చేయాల్సిందేనని, దీని పర్యవేక్షణకు సీసీ టీవీలను వినియోగించాలని ఆదేశించారు.

ఎయిర్ క్వాలిటీని అన్ని కోణాల్లో విశ్లేషించాలని, మానిటరింగ్ కోసం లేటేస్ట్ టెక్నాలజీని వినియోగించి, ఆ డేటాను అవేర్-2.0 వ్యవస్థకు అనుసంధానం చేయాలని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను దృష్టిలో ఉంచుకుని, రెడ్ జోన్ పరిశ్రమలకు 12 రోజులు, ఆరెంజ్ జోన్కు 10 రోజులు, గ్రీన్ జోన్కు 3 రోజుల్లో అనుమతులు ఇవ్వాలని సూచించారు. సీవరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్లు, మైనింగ్ పొల్యూష్యన్ విషయంలోనూ చర్యలు చేపట్టాలన్నారు.

మైక్రో ఇరిగేషన్‌లో ప్లాస్టిక్ షీట్స్ వినియోగం వల్ల రైతులకు దీర్ఘ కాలంలో ఇబ్బందులు తలెత్తకుండా బయో షీట్స్ వేసేలా అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు అవసరమైన సిబ్బంది కావాలని ఆ సంస్థ ఛైర్మన్ కృష్ణయ్య కోరగా, సీఎం అంగీకారం తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, వైద్యారోగ్య శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో భూముల అమ్మకంపై ప్రభుత్వాన్ని నిలదీయండి:

మొదటి పేజీ తరువాయి

పదేళ్ల పాటు ఎలాంటి అవినీతికి తావు లేకుండా పనిచేశారని.. కరోనా వంటి తీవ్ర సంక్షోభంలోనూ అద్భుతంగా సేవలందించారని కొనియాడారు.ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత కార్పొరేటర్లు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై పోరాటం చేశారన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోరాడిన తీరుకు కేటీఆర్ అభినందనలు తెలిపారు. పరిశ్రమలకు కేటాయించిన వాటితో పాటు హైదరాబాద్‌లో భూముల అమ్మకంపై బల్దియా సమావేశంలో నిలదీయాలని ఆయన సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రభుత్వ వైఫల్యంపై నిలదీయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించినా సిద్ధంగా ఉండాలని.. అందరినీ పార్టీ గెలిపించుకుంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

## అన్ని రంగాల్లో పిల్లలు రాణించాలి

మొదటి పేజీ తరువాయి



జీవితాల్లో మార్పు రావాలంటే పిల్లల్ని చదివించాలన్నారు. కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో తొలి సైనిక్ స్కూల్‌ను ఇక్కడే ఏర్పాటు చేయబోతున్నాం. 16 నెలల్లోగా కొడంగల్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తయారు చేస్తాం అని ప్రకటించారు. మహిళలు ఆత్మగౌరవంతో బతికేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రంలోని ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. మహిళలకు

ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. వెయ్యి ఆర్టీసీ బస్సులకు వారిని యజమానులుగా చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులకు కూడా యజమానులను చేశాం అని వెల్లడించారు. అదానీ, అంబానీలతో పోటీపడేలా వారిని ప్రోత్సహిస్తున్నాం. మహిళా సంఘాల ఉత్పత్తులు అమెజాన్‌లో అమ్ముకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం అని అన్నారు. మూడు నెలల్లో కొడంగల్‌లోని ప్రతి గ్రామానికి కృష్ణా నీళ్లు అందిస్తాం. లగచర్ల పారిశ్రామికవాడకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తాం.త్వరలో సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయి. 3, 4 రోజుల్లో సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. అభివృద్ధికి మద్దతుగా ఉండేవారిని సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలని రేవంత్ పిలుపునిచ్చారు. ప్రజలకు కోట్ల రూపాయలు ఇవ్వలేనని.. పిల్లలకు అంతకంటే విలువైన చదువు చెప్పించగలనని అన్నారు. చదువు జీవితాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని అన్నారు. అందులో భాగంగా కొండంగల్ లో 5 వేల కోట్ల రూపాయలతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మించుకున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సిఎం పలు అభివృద్ధి కార్యక్రామలు చేపట్టడంతో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనులకు కొత్త ఊపు వచ్చింది. మొత్తం రూ.103 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, పట్టణాభివృద్ధి నుంచి విద్య, సంక్షేమం వరకు అనేక రంగాల్లో ఈ పనులు ప్రారంభమవడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, నియోజకవర్గంలో మొత్తం 28 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.5.83 కోట్లు, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో 23 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.5.01 కోట్లు కేటాయించారు. గ్రామీణ పరిపాలనను బలోపేతం చేసేందుకు 10 గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.3 కోట్లు వెచ్చించనున్నారు. బంజారా భవన్‌లో అదనపు సౌకర్యాల కోసం కాంపౌండ్ వాల్, డైనింగ్ హాల్, నీటి సరఫరా, విద్యుదీకరణకు కలిపి రూ.3.65 కోట్లు మంజూరు చేశారు. కొడంగల్ పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, ప్రొహిబిషన్ / ఎక్సైజ్ స్టేషన్ నిర్మాణానికి రూ.1 కోటి, అగ్నిమాపక కేంద్రానికి రూ.1.30 కోట్లు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి రూ.1.40 కోట్లు కేటాయించారు. అలాగే కమ్యూనిటీ హాళ్లు, కిచెన్ షెడ్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి రూ.4.91 కోట్లు, సీసీ రోడ్లు , భూగర్భ డ్రైనేజ్ (జఉఆ) వ్యవస్థ అభివృద్ధికి రూ.4.45 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే నిర్మించిన అదనపు తరగతి గదులు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయ భవనాల ప్రారంభోత్సవం కూడా ఈ సందర్భంగా జరిగింది, వీటి కోసం రూ.2.95 కోట్లు వెచ్చించారు. కొడంగల్ పట్టణ అభివృద్ధి దిశగా అత్యంత కీలకంగా పరిగణిస్తున్న రోడ్డు విస్తరణ పనులకు ఒక్కటే రూ.60 కోట్లు కేటాయించగా, కొత్త గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేశారు. కోస్గి వ్యవసాయ మార్కెట్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రూ.4.50 కోట్లు మంజూరు చేయడం రైతులకు ఉపయోగకరంగా ఉండనుంది. ఈ మొత్తం ప్రాజెక్టులు కొడంగల్ నియోజకవర్గపు సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ముఖ్య పాత్ర పోషిస్తాయని, ఈ ప్రాంత ప్రజల అవసరాలను తీర్చడంలో పెద్ద అడుగుగా నిలుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

# మాకు ఆయుధాలకు లైసెన్సులు ఇవ్వండి

**– బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు**
**– షాద్ నగర్ నియోజకవర్గం ఎల్లంపల్లి గ్రామాన్ని సందర్శించిన ఆర్ఎస్ ప్రవీణ్**
**– ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అర్జెంటుగా రాజీనామా చేయాలి**
**– దిశా ఎన్ కౌంటర్ తరహాలో నిందితులకు శిక్ష పడాలి**
**– షాద్ నగర్ ప్రొబిషనరీ ఎస్ఐ శ్రీకాంత్, ఏఎస్సై శ్రీరాములను వెంటనే ఉద్యోగం నుండి తప్పించాలి**
**– హత్యకు గురైన దళితుడు రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు ఎందుకు రాలేదు..?**
**– ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు ఎక్కడ**
**– ఎర్ర రాజశేఖర్ కుటుంబానికి పూర్తిస్థాయి న్యాయం జరగాల్సిందే..**

**ఇది కద నిజం:**
ఆపదలో ఉన్న వారిని పోలీసులు రక్షించకపోతే ఈ ప్రభుత్వం వారికి రక్షణ కల్పించకపోతే.. ఎక్కడ ఏ సంఘటన జరిగినా బహుజన వర్గాలే చితికి పోతున్నారని వారి రక్షణకు గ్రేహౌండ్స్, ఆక్టోపస్ తరహాలో ఒక కమాండో ఫోర్స్ నిర్మించి అవసరమైతే అది మీ చేతుల్లోనే పెట్టుకుని పేదల చేతికి వారి రక్షణ నిమిత్తం ఆయుధాలు ఇవ్వండి వాటికి లైసెన్సులు కూడా ఇవ్వండి అప్పుడు వాళ్ళ ప్రాణాలు వాళ్లే కాపాడుకుంటారు.. అంటూ భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఎల్లంపల్లి గ్రామంలో దళితుడు ఎర్ర రాజశేఖర్ పరువు హత్యకు గురైన సందర్భంగా అతని కుటుంబాన్ని పరామర్శించడానికి స్థానిక నాయకులతో కలిసి ఆయన గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎర్ర రాజశేఖర్ సతీమణి ఎర్రవాణి, తండ్రి ఎర్ర మల్లేష్ తదితరు కుటుంబ సభ్యులను స్థానిక నాయకుడు మాజీ ఎంపీపీ వై రవీందర్ యాదవ్ తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడిన అనంతరం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వంపై సంచలన విమర్శలు చేశారు. బహుజన ప్రజలను రక్షించడం చేతకాకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని హోం మంత్రిత్వ శాఖను తన చేతుల్లో పెట్టుకొని పేదలను ఆపదలు కాపాడకపోతే ఆ పదవి ఎందుకని వెంటనే రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. ఎల్లంపల్లి గ్రామానికి చెందిన ఎర్ర రాజశేఖర్ పరువు హత్యకు గురైన నేపథ్యం వెనుక పోలీసుల నిర్లక్ష్యం నిండుగా కనిపిస్తుందని ఆయన ఆరోపించారు. న్యాయం చేయమని పోలీస్ స్టేషన్ కు వెళ్తే ప్రొఫెషనరీ ఎస్ఐ శ్రీకాంత్, ఏఎస్ఐ శ్రీరాములు మృతుని పట్ల అతని కుటుంబ సభ్యుల పట్ల పరకశంగా వ్యవహరించారని వారి




చావుకు వీరు కూడా బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని వెంటనే వీరిని సర్వీస్ నుండి తొలగించాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. పరువు హత్య సంఘటనకు బాధ్యత వహించి ఇక్కడ పర్యవేక్షణ నిర్వహిస్తున్న అధికారులపై కూడా శాఖ పరమైన చర్యలు చేపట్టాలని ఆర్ఎస్ ప్రవీణ్ డిమాండ్ చేశారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కెసిఆర్ మరియమ్మ కేసులో పోలీసులపై కఠిన చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. పరువు హత్య జరిగి మనిషి ప్రాణం అత్యంత దారుణంగా అవమానియా రీతిలో సంఘటన జరిగితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారని ముఖ్యంగా సంబంధిత శాఖ మంత్రి అద్దూరి లక్ష్మణ్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనర్సింహ మంత్రులు బాధిత కుటుంబాన్ని ఎందుకు పరామర్శించడం లేదని ప్రశ్నించారు. మృతుడి తండ్రి మల్లేష్కు నూట మూడు డిగ్రీల జ్వరం ఉన్నా కూడా ఎవరు ఎందుకు పలకరించడం లేదని ఆర్ఎస్ ప్రవీణ్ ప్రశ్నించారు. డెక్కన్ సిమెంట్ వ్యవహారంలో కన్నులు పెట్టి బెదిరించిన ముఖ్యమంత్రి అనుచరుడు రోహన్ రెడ్డి లాంటి వారిని వెంటనే కాపాడి మంత్రి కొండ సురేఖ ఇంటికి పోలీసులు పంపించిన ముఖ్యమంత్రి ఇలాంటి బహుజన వర్గాల వారు రక్షణ కోరితే ఎందుకు ముఖ్యమంత్రి స్పందించడం లేదని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం ప్రజా పాలన అంటున్న ముఖ్యమంత్రికి ప్రజలను పాలించే నైతిక హక్కు లేదని ఈ సంఘటనకు బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉన్నత వర్గాలకు ఆయుధాలు ఎలా లైసెన్సీ ఇచ్చి ఇస్తారో అలాగే బహుజనుల చేతికి ఆయుధాలు ఇచ్చి వాటికి లైసెన్స్ కల్పించి వారి రక్షణ వారు చేసుకునే విధంగా కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సవాల్ విసిరారు. ప్రభుత్వం సంఘటన జరిగినప్పుడు ఇచ్చి ఏదో చేతులు దులుపుకుంటే సరిపోదని, దిశా తరహాలో జరిగిన ఎన్కౌంటర్ మాదిరిగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులకు కఠిన శిక్ష పడేవిధంగా చూడాలని, నిర్భయ కేసులో ఇలాంటి చర్యలు తీసుకున్నారు అలా చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.

# నిజాంపేట్ కమిషనర్ సాబీర్ అలీని తక్షణమే బదిలీ చేయాలి - JAC



**ఇది కద నిజం:**
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రస్తుత కమిషనర్ సాబీర్ అలీ అక్టోబర్ 2024లో అర్హతలు లేకుండానే బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాల్లో భారీ అవినీతి, అక్రమాలు కొనసాగుతున్నాయి. తనకు అనుకూల వ్యక్తులను అధికార పదవుల్లో నియమించుకొని ఉద్యోగుల సిండికేట్‌ను ఏర్పాటు చేసి కార్పొరేషన్‌ను దివాలా తీయించే స్థాయిలో పాలన చేస్తున్నారని JAC నాయకులు ఆరోపించారు. సానిటేషన్, డ్రైనేజ్, డంపింగ్ యార్డ్ నిర్వహణ పూర్తిగా దుర్బలమై, పార్కులు రోడ్లు ఆక్రమణల నుంచి కాపాడడంలో విఫలమైన సాబీర్ అలీ అత్యంత అసమర్థతతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేషన్‌కు చెందిన ప్రభుత్వ స్థలాలను కూడా రక్షించడంలో నిర్లక్ష్యం కారణంగా అనేక సమస్యలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో JAC తరఫున అడిషనల్ కలెక్టర్ విజేందర్ రెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు అందజేస్తూ, ప్రస్తుత కమిషనర్ సాబీర్ అలీని వెంటనే బదిలీ చేయాలని, తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 ప్రకారం గ్రూప్ 1 లేదా IAS అధికారులు మాత్రమే కమిషనర్‌గా నియమించాల్సిందిగా, గత ఏడాది కాలంలో జరిగిన అన్ని అవినీతి అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు ఆకుల సతీష్ మాట్లాడుతూ ప్రగతి నగర్‌లో ఇప్పటికే ధర్నా చేసి, CDMA కార్యాలయంలో ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారుల నుంచి స్పందన లేకపోవడం విచారకరమన్నారు. సాబీర్ అలీ వంటి అర్హతలేని అధికారిని కొనసాగిస్తే వచ్చే డిసెంబర్‌లో కార్పొరేషన్ ప్రజలతో కలిసి మున్సిపల్ ఆఫీస్‌ను ముట్టడించాల్సి వస్తుందని హెచ్చరించారు. హిందూ వైకుంఠధామం భూకేటాయింపు వివాదంపై JAC స్పందన. 2022లో ప్రభుత్వం హిందూ వైకుంఠధామం కోసం సర్వే నెం. 186లో 3.20 ఎకరాలు కేటాయిస్తామని ఉత్తర్వులు ఇచ్చినా, ఇప్పటివరకు కేవలం 1.20 ఎకరాలు మాత్రమే కేటాయిస్తామని అధికారులు చెప్పడం అన్యాయం అని JAC నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో ముస్లింలకు మాత్రం రెండు ఎకరాలు అత్యంత వేగంగా కేటాయించి అభివృద్ధి జరపడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, హిందువులపై ప్రభుత్వం మరియు స్థానిక ఎమ్మెల్యే వివేకానంద వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. సర్వే నెంబరు 186లో భూమి అందుబాటులో లేకున్నా, పక్కనున్న సర్వే నెంబర్లు 343, 346 నుంచి మొత్తం 3.20 ఎకరాలు కేటాయించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, నల్ల జై శంకర్ గౌడ్, కంది శ్రీరాములు, పులి బలరాం, భీమ్ రాజు, అరుణ్, శ్రీనివాస్, కృష్ణ, శ్రీనివాస్ గౌడ్, శంకర్ రెడ్డి, సంతోష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# నిఖత్ జరీన్ పోరాట యాత్ర.. ఆమె కథ యువతకు ప్రేరణ

**– చిన్న నాటి నుండి “ఓడిపోవడం నాకు ఇష్టం లేదు..**
**– 2011లో టర్కీలో జరిగిన జూనియర్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం..**
**– 13 ఏళ్ల వయసులోనే కోచ్ ఓంకార్ నాథ్ యాదవ్ ఆమెలోని ప్రతిభను గుర్తించారు..**

**ఇది కద నిజం,డెస్క్:**
నిజామాబాద్‌కి చెందిన భారత బాక్సింగ్ స్టార్ నిఖత్ జరీన్ తన జీవన ప్రయాణాన్ని ఓ అరుదైన హృదయ స్పందనతో వెల్లడించారు. చిన్న నాటి నుండి “ఓడిపోవడం నాకు ఇష్టం లేదు” అనే వాక్యం ఆమె జీవితానికి దిశ చూపినట్లు నిఖత్ చెప్పిన మాటలు ఇప్పుడు యువతకు ప్రేరణగా మారుతున్నాయి. నిఖత్‌ను ఆమె తండ్రి బాక్సింగ్ వైపు మళ్లించిన విధానం ఆమె కథలో కీలక భాగమైంది. ఒక రోజు స్థానిక జిమ్ పక్కగా వెళ్లినప్పుడు బాలురు బాక్సింగ్ సాధన చేస్తుండగా చూసిన దృశ్యం ఆమె మనసులో మార్పు తీసుకొచ్చిందని నిఖత్ గుర్తుచేసుకున్నారు. ఆ క్షణమే బాక్సింగ్ ఆమె జీవితంలోకి ప్రవేశించిన తొలి అడుగు అయింది. “అమ్మాయిలకు బాక్సింగ్ ఎందుకు?” వంటి ప్రశ్నలు, కుటుంబ ఆందోళనలు ఇవన్నీ ఎదురైనా నిఖత్ తండ్రి ధైర్యంగా నిలబడ్డారని ఆమె అన్నారు. 13 ఏళ్ల వయసులోనే కోచ్ ఓంకార్ నాథ్ యాదవ్ ఆమెలోని ప్రతిభను గుర్తించగా, అదే సంవత్సరంలో జరిగిన సబ్-జూనియర్ నేషనల్స్‌లో స్వర్ణం మరియు బెస్ట్ బాక్సర్ అవార్డును గెలుచుకుని తన సామర్థ్యాన్ని నిరూపించారు. 2011లో టర్కీలో జరిగిన జూనియర్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం గెలుచుకోవడం నిఖత్ కెరీర్‌కు మలుపుగా నిలిచింది. కానీ విజయాలు వచ్చినంత వేగంగా సవాళ్లు కూడా వచ్చాయనే విషయాన్ని ఆమె మనసుపారబోసుకుంటారు. గాయాలు, నిరుత్సాహం, సందేహాలు ఇవన్నీ ఎదురైనా ప్రయాణం ఆగలేదని చెప్పారు. మేరీ కోమ్‌తో న్యాయమైన ట్రయల్ కోరడం తన కెరీర్‌లో అత్యంత ధైర్యవంతమైన నిర్ణయమని నిఖత్ పేర్కొన్నారు. ఆ ట్రయల్‌లో ఓడినా, అది తన తదుపరి అధ్యాయానికి బాటలు వేసిందని ఆమె చెబుతున్నారు. తనను తాను కొత్తగా తీర్చిదిద్దుకుంటూ, మరింత కఠినంగా శ్రమించి, 2022లో ఇస్తాంబుల్‌లో వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచింది. అనంతరం ఒలింపిక్ కేటగిరీకి తగ్గట్టుగా బరువు మార్చుకోవడం, 2023 వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో అన్‌సీడెడ్ ఆటగాళ్లలో ఒకరిగా పోటీ చేయడం వంటి కఠిన నిర్ణయాలను తీసుకుని, వరుసగా బలమైన ప్రత్యర్థులను ఓడిస్తూ రెండో వరల్డ్ టైటిల్‌ను






అందుకుంది. తన విజయాల వెనుక కుటుంబం చేసిన త్యాగాలు, ముఖ్యంగా పోటీలలో పాల్గొనేందుకు తండ్రి కారు కూడా అమ్మిన సంఘటనను నిఖత్ భావోద్వేగంతో ప్రస్తావించారు. బాక్సింగ్ గ్లోవ్స్ తనకు కేవలం పోరాడటం మాత్రమే కాదు, జీవించడం నేర్పించాయని చెప్పిన ఆమె భావోద్వేగ వ్యాఖ్యలు అనేక మందిని స్పందించేలా చేశాయి. ఒలింపిక్ స్వర్ణం ఇప్పుడు తన లక్ష్యమని స్పష్టంగా చెబుతున్న నిఖత్ జరీన్, కష్టాలు ఎంతైనా ఎదురైనా వెనక్కి తగ్గరని సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. భారత బాక్సింగ్ ప్రపంచానికి నిఖత్ కథ ప్రేరణ, పట్టుదల, సంకల్పానికి నిదర్శనంగా నిలుస్తోంది.

# వందేమాతరం గేయనికి 150 ఏళ్ళు.. నవాబుపేట్‌లో సామూహిక గానం, నశాముక్త భారత్ ప్రతిజ్ఞ

**ఇది కద నిజం,నవాబుపేట్:**



చేవెళ్ల నియోజకవర్గంలోని నవాబుపేట్ మండల కేంద్రంలో వందేమాతరం గీతం ప్రారంభమై 150 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా సామూహిక వందేమాతరం గీతం ఆలాపన కార్యక్రమాన్ని యూవత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని ZPHS పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వందేమాతరం గీతం ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు, నశాముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల వాడుక హానికర ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులందరితో మత్తు పదార్థాల వ్యసనానికి దూరంగా ఉండే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు, బీజేపీ మండల అధ్యక్షులు ఎస్. చంద్రకాంత్, మాజీ జిల్లా కార్యదర్శి ఎస్. జగన్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పి. ప్రభాకర్ రెడ్డి, బూత్ అధ్యక్షులు సీఎచ్. ఆంజనేయులు, శివ తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ శంకరపల్లి రహదారి అధ్వానమయం.. ప్రాణాలు పోతున్న పట్టించుకోని ప్రభుత్వం

**ఇది కద నిజం, వికారాబాద్:**



వికారాబాద్ జిల్లా ప్రజలకు ప్రాణాంతకంగా మారిన వికారాబాద్ శంకరపల్లి రహదారి పరిస్థితి రోజు రోజుకూ మరింత దారుణంగా మారుతోంది. ప్రధాన మార్గం అయిన ఈ రోడ్డు గత 5-6 సంవత్సరాలుగా సంపూర్ణ నిర్లక్ష్యానికి గురై, వర్షాలు పడ్డ ప్రతి సారి మోకాలలోతు గుంతలు ఏర్పడి ప్రయాణికులకు నరకయాతనను తీసుకొస్తోంది. స్థానికులు, ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు నిత్యం ఈ రహదారి పై వెళ్లాలంటే తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుంది. అదే గుంతల్లో ఎన్నో ప్రాణాలు ఎన్నో కుటుంబాలు విలవిలలాడాయి

ఈ రహదారిపై గుంతల కారణంగా ఇప్పటికే అనేక రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టాలు చోటుచేసుకున్నాయి. బైక్‌పై వెళ్తున్న వారు అకస్మాత్తుగా లోతైన గుంతల్లో పడిపోవడం, రాత్రిపూట వాహనాలు అదుపుతప్పి ఢీకొనడం, అంబులెన్స్‌లు సైతం వేగం తగ్గించి ప్రయాణించాల్సిన పరిస్థితి. ప్రస్తుతం ఇవన్నీ రోజువారీ దృశ్యాలయ్యాయి. ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ ఈ రహదారి పరిస్థితి మాత్రం మారడం లేదు. BRS ప్రభుత్వంలో ఎన్నో విన్నపాలు%ా% ఫలితం శూన్యం గత ప్రభుత్వం అయిన BRS పాలనలో స్థానిక ప్రజలు ఎన్నో సార్లు కార్యక్రమాలు నిర్వహించి, అధికారులకు వినతి పత్రాలు, పత్రికా కవరేజ్, సోషల్ మీడియా పోస్ట్‌లు ఎన్ని చేసినా స్పందన రాలేదు. రోడ్డు మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చినా అమలు మాత్రం కనబడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా పరిస్థితి యథాతథమే ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అయినా మార్పు వస్తుందని ప్రజలు ఆశించారు. కానీ ఇప్పటివరకు ఒక్క చిన్న పనైనా ప్రారంభం కాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి రోడ్డు పరిశీలన చేయాలన్నా ముందుకు రాకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. “ప్రతి ప్రభుత్వానికీ ఈ రహదారి సమస్య కనిపించడం లేదా?” అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ఆవేదన “ఇంకా ఎన్ని రోజులు? ఇంకా ఎన్ని ప్రాణాలు పోతే కదులుతారు?” నిత్యం ఈ రహదారిపై తిరిగే ప్రజలు భయంతో ప్రయాణిస్తున్నారు. బైక్‌పై వెళ్లడమే పెద్ద ప్రమాదంలా మారింది. రోడ్డు గుంతలను తప్పించుకోడానికి వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు . “ఇంకా ఎన్ని ప్రాణాలు కోల్పోవాలి? ఇంకా ఎన్ని రోజులు ఇలా భయంతో ప్రయాణించాలి? కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం కదిలి రోడ్డు ని నయం చేయాలి. ఒక నాయకుడు అయినా ముందుకు వచ్చి ప్రజల కష్టాలు తెలుసుకోవాలి.” ఈ రహదారిని వెంటనే పునర్నిర్మించాలి , గుంతలు తొలగించి సురక్షితంగా మార్చాలి, రోజూ ఈ రూట్‌పై ప్రయాణించే వేల మందికి రక్షణ కల్పించాలి అని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రజల ప్రాణాలకన్నా ముఖ్యమేదీ లేదని ప్రభుత్వం గుర్తించి, కనీసం ఇప్పటికైనా నూతన రహదారి వేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

# గండిపేట నూతన ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ స్టేషన్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**శంషాబాద్ లో జిల్లా ఎక్సయిజ్ సూపరిండెంట్ కార్యాలయ భవన నిర్మాణానికి 50 లక్షల రూపాయల నిధులు ఇస్తామని ఎమ్మెల్యే హామీ**



**ఇది కద నిజం, రాజేంద్రనగర్ :**
తెలంగాణ వ్యాప్తంగా నూతనంగా 14 ఎక్సయిజ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో బండ్లగూడ జాగీర్ లో గండిపేట నూతన ఎక్సయిజ్ స్టేషన్ ను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ మహమ్మారిని కట్టడి చేసే దిశగా ఎక్సయిజ్ శాఖను బలోపేతం చేస్తున్నామన్నారు. అందుకోసం నూతన ఎక్సయిజ్ అధికారులు,సిబ్బంది రిక్రూట్ మెంట్ తో పాటు నూతన స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎక్సయిజ్ సూపరిండెంట్ కృష్ణప్రియ, డిప్యూటీ ఎక్సయిజ్ సూపరిండెంట్ శ్రీనివాస్ రెడ్డి, స్టేషన్ హౌస్ ఆఫీసర్ దేవేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# గౌర్రెకల్‌లో త్రాగునీటి ఫిల్టర్ ప్రారంభం

**ఇది కద నిజం:**
వట్పల్లి మండలంలోని గౌర్రెకల్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన త్రాగునీటి ఫిల్టర్‌ను శనివారం గ్రామ పెద్దలు సాంప్రదాయ పూజలతో ప్రారంభించారు. కడారి నరసింహ గౌడ్ కుమారుడు కృష్ణ గౌడ్ స్వయంగా గ్రామస్థుల కోసం ఈ త్రాగునీటి ఫిల్టర్‌ను ఏర్పాటు చేశారు.



ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సిద్ధి రామప్ప, మల్లన్న, కాడి మల్లప్ప, ముంగే సూరెడ్డి పాల్గొన్నారు. గ్రామస్థులకు ఎల్లప్పుడూ శుద్ధ త్రాగునీరు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ ఫిల్టర్‌ను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కేవలం పది రూపాయలకు ఒక్క టీన్ బాటిల్ నీటిని విక్రయించేలా ధరను నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే గ్రామంలోని చిన్నపాటి శుభకార్యాలు, ఫంక్షన్లకు కూడా ఫిల్టర్ నీటిని సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.
ఫిల్టర్ పంపు ప్రారంభంతో నీటిని దూరం నుంచి తెచ్చే భారం తగ్గడంతో గ్రామస్థులకు ఎంతో సౌకర్యం కలిగిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పాలకులారా పేద ప్రజల గోడు పట్టించుకోరా ???

**- ఏడవ రోజుకు చేరిన నిరసన దీక్ష**
**- పాలకులు,అధికారులు ఇప్పటికైనా మేల్కొని నష్టపోయిన ప్రజలకు న్యాయం చేయాలి**
**- భూస్వాముల ఆధీనంలో ఉన్న వందల ఎకరాల లెక్కలు తేల్చాలి**
**- వందల ఎకరాల భూస్వాములపై ప్రభుత్వానికి, అధికారులకి అంత ప్రేమ దేనికి???**
**- డిమాండ్ చేస్తున్న సిపిఐ**



**ఇది కద నిజం:**
అశ్వరావుపేట సర్వే నెంబర్ 1228 లో ప్రభుత్వ భూములో పేద ప్రజలు నిర్మించుకున్న గుడిసెలను నిర్దాక్షిణ్యంగా కూల్చేసిన అమానవీయ చర్యకు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష ఏడవ రోజుకు చేరింది. పాలకులు, అధికారులు దిగివచ్చి నష్టపోయిన పేద ప్రజలకు న్యాయం చేయాలని చేపట్టిన ఈ దీక్షకు వివిధ రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు మద్దతు తెలియజేస్తూ సిపిఐ, పేద ప్రజలు చేసే పోరాటం లో వారికి మద్దతుగా తామందరం నడుస్తామని తెలియజేశారు. అశ్వరావుపేటలో భూస్వాముల ఆధీనంలో కొన్ని వందల ఎకరాలు ఉన్నప్పటికీ వాటిని పక్కనపెట్టి పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలు కష్టపడి గుడిసెలు నిర్మించుకొని 5,6 సంవత్సరాలుగా నివసిస్తున్న తరుణంలో వాటిని కూల్చేయడం క్రూరమైన చర్యగా వివిధ రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పాలకులు, అధికారులు ఇప్పటికైనా మేల్కొని నష్టపోయిన ప్రజలకు ప్రత్యామ్నాయం చూపించి, వారికి నష్టపరిహారాన్ని ఇవ్వాల్సిందిగా సిపిఐ పార్టీ శ్రేణులు, బాధిత ప్రజలు డిమాండ్ చేస్తున్నాయి. అశ్వరావుపేటలో భూస్వాములు ఆధీనంలో ఉన్న వందల ఎకరాల ప్రభుత్వ భూమి లెక్కలు తేల్చుకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపట్టి ముందుకు తీసుకువెళతామని సిపిఐ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం విలేకరులతో మాట్లాడుతూ గత 5,6 సంవత్సరాలుగా సర్వేనెంబర్ 1228 లోని ప్రభుత్వ భూముల్లో పేద ప్రజలు అడవి నరికి,గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తూ వస్తున్నారు. అట్టి ప్రజల ఇళ్లను దౌర్జన్యంగా ఎటువంటి సమాచారం లేకుండా ప్రభుత్వం, అధికారులు, పోలీసులు కూల్చేయటం దుర్మార్గపు చర్య అని, ఒకపక్క ప్రభుత్వం పేద ప్రజలు ప్రభుత్వ భూమిలో ఇల్లు నిర్మించుకుంటే వాటిని తొలగించవద్దని చెబుతున్న, అశ్వరావుపేట కాంగ్రెస్ నాయకులు దానిని పక్కనపెట్టి వారికి ఇష్టారాజ్యంగా పేదల ఇళ్లను కూల్చి వేస్తూ,పేదలపై ఇష్టారాజ్యంగా దౌర్జన్యానికి తెగబడుతున్నారు. అశ్వరావుపేట కాంగ్రెస్ నాయకులు ఇప్పటికైనా తమ వైఖరినే మార్చుకోవాలి అని, ప్రజలను ఇలా కష్టపెట్టడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, నష్టపోయిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు గౌరవిస్తుంది : డిసిసి ఉపాధ్యక్షుడు ఎండి ముల్తానీ

**ఇది కద నిజం:**



కాంగ్రెస్ ప్రభుత్వం రాబోయే రోజుల్లో మహిళలను అన్ని రంగాలలో అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. అంతే కాకుండా మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని సంక్షేమ పథకాలను త్వరలోనే అమలుపరిచేందుకు రేవంత్ సర్కార్ కృషి చేస్తుందని నియోజకవర్గ సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ ముల్తానీ అన్నారు. సోమవారం నాడు ఝరాసంగం మండలంలోని మచ్నూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గ్రామ మహిళలకు ఇందిరమ్మ మహిళ శక్తి చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.
నిన్న మునిపల్లి మండలం లోని . ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం.
సంగారెడ్డి జిల్లా/నమస్తే ఇందూర్/మునిపల్లి మండలం/నవంబర్ 24. కే యాదయ్య జిల్లా స్టాఫ్ రిపోర్టర్.మునిపల్లి, మండలంలోని వివిధ గ్రామాలలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఈరోజు జరిగింది. ఈ కార్యక్రమానికి మునిపల్లి మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ సీనియర్ జూనియర్స్ అందరూ హాజరు కావడం జరిగింది.మల్లారెడ్డి పేట్, బుస్సారెడ్డి పల్లి,మల్లికార్జున పల్లి, హైద్లపూర్,అల్లాపూర్ తక్కడపల్లి,బోడపల్లి, చిన్న చెల్మడ, ఖమ్మం పల్లి,పోల్కంపల్లి, గౌర్రెగాట్, గోపులారం,బుదేరా,ఇబ్రహీం పూర్ గ్రామపంచాయతీ కార్యాలయం నందు పల్లెల్లో ప్రతి స్వయం సహాయక సంఘం ఆడబిడ్డ ఇంటికీ ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మునిపల్లి మండల నాయకులు

# తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మరియు శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి వర్యులు

దామోదర్ రాజనర్సింహ గారి ఆదేశానుసారం మునిపల్లి మండల కేంద్రంలో స్వయం సహాయక సంఘం ఆడబిడ్డలకు'పుట్టింటి సారె' మాదిరిగా ఆత్మ గౌరవంతో కూడిన నాణ్యమైన ఇందిరమ్మ చీరల పంపిణీ చేశామన్నారు.ఈ కార్యక్రమం లో పిల్లోడి సతీష్ కుమార్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు యం సుధాకర్ రెడ్డి చేర్మెన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ రైకోడ్ ఎంపీడీఓ సార్ %ఇు% ప్రదీప్ %ూ్రావీ% నర్సింలు %జజ% లు సంగమేశ్వర్, శ్రీనివాస్ మండల ఉపాధ్యక్షులు రసూల్ పటేల్ మునిపల్లి మండల సీనియర్ నాయకులు నాయకోటి సంగమేష్ మరియు కాంగ్రెస్ నాయకులు మరియు ఆయా గ్రామ కాంగ్రెస్ నాయకులు మరియు, స్వయం సహకార సంఘ మహిళలు పాల్గొన్నారు



# కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి చందు యాదవ్ డిమాండ్

**ఇది కద నిజం:**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండల కేంద్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కీలక సమావేశంలో రాబోయే సర్పంచ్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వివిధ కీలక నిర్ణయాలు తీసుకున్నారు.
ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గం బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఇంచార్జి వేల్పుల చందు యాదవ్ మాట్లాడుతూ, ప్రభుత్వం విడుదల చేసిన జీవో నం. 46 ను వెంటనే రద్దు చేయాలని గట్టిగా డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఇవ్వాల్సిన 42 శాతం రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్లో చేర్చి శాశ్వత రక్షణ కల్పించాలని సమావేశంలో తీర్మానించారు.అదేవిధంగా, బీసీలకు 42% రిజర్వేషన్ ఉంటే, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50% మించకూడదనే ప్రభుత్వ నిర్ణయాన్ని జేఏసీ తీవ్రంగా వ్యతిరేకించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన 42% బీసీ రిజర్వేషన్ల అమలులో విఫలమైందని, కామారెడ్డి డిక్లరేషన్‌ను సంపూర్ణంగా అమల్లోకి తీసుకురావాలని స్పష్టంగా డిమాండ్ చేశారు.జీవో 46 రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలంతా ఏకమై భారీ స్థాయిలో ధర్నాలు, రాస్తారోకాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నామనే హెచ్చరికను జేఏసీ నాయకులు ప్రకటించారు.

# బీసీల హక్కుల కోసం మళ్లీ ఉద్యమానికి సిద్ధం కావాలి

**- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**
**- తెలంగాణ భవన్‌లో బీసీ నాయకుల సమావేశం**
**- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**

**ఇది కద నిజం:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలను ఉద్దేశపూర్వకంగా మోసం చేస్తూనే ఉన్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్రంగా మండిపడ్డారు. బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విషయంలో సీఎం నటిస్తున్నారని, న్యాయం చేసేందుకు ఆయనకు అసలు ఆసక్తే లేదని విమర్శించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో బీసీ నాయకుల సమావేశం నిర్వహించగా, కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ అమలు విషయంలో ప్రభుత్వం చేస్తున్న "మోసం, దగా"లను ఈ సమావేశంలో స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, శ్రీనివాస్ గౌడ్, జోగు రామన్నతో పాటు శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాష్, ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ ఛైర్మన్ స్వామి గౌడ్, ఎమ్మెల్సీలు శ్రవణ్, రమణ, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి "పులిపై స్వారీ చేస్తూ ఒకేసారి దిగలేని పరిస్థితిలో ఉన్న వ్యక్తిలా నటిస్తున్నారు" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించిన ఎంపీ రవిచంద్ర, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అందేది



బీఆర్ఎస్ అధినేత, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే సాధ్యమని స్పష్టం చేశారు. కేసీఆర్ పాలనలోనే బీసీలకు గౌరవం దక్కిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల బీసీలు అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ మంత్రివర్గంలో మున్నూరుకాపు, యాదవ, లంబాడలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం బాధాకరమని, బీఆర్ఎస్ నిరంతరం ఒత్తిడి తేవడంతో ముదిరాజ్, ముస్లింలకు కేబినెట్‌లో అవకాశం ఇచ్చినట్లు గుర్తుచేశారు. గ్రామ స్థాయిలో రాజకీయ పట్టు సాధించాలంటే రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధిక స్థానాలు గెలుచుకోవాలని రవిచంద్ర పిలుపునిచ్చారు. బీసీల ఐక్యతను ప్రపంచానికి చాటి చెప్పేందుకు భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైతే తెలంగాణ ఉద్యమం మాదిరిగా బీసీల ఉద్యమాన్ని మళ్లీ ఉధృతం చేసి రిజర్వేషన్లకు చట్టబద్ధత సాధించుకోవాలని చెప్పారు. బీసీలతో కలిసి శక్తివంతమైన ఉద్యమాన్ని చేపట్టి, కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అయ్యాక కేంద్రంపై తీవ్ర ఒత్తిడి తెచ్చి రిజర్వేషన్లను సాధించుకుందామని ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు.

# శిశు మందిర్ హైస్కూల్‌లో సప్తశక్తి సంగం మహిళల్లో చైతన్య జ్యోతి

**ఇది కద నిజం:**




రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సప్తశక్తి సంగం పేరుతో మహిళా చైతన్య కార్యక్రమం సోమవారం శ్రీ సరస్వతీ శిశు మందిర్ హైస్కూల్‌లో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి 200 మందికి పైగా మహిళలు హాజరై ఉత్సాహాన్ని నింపారు.కార్యక్రమంలో ప్రసంగించిన విద్యాపీఠం తెలంగాణ ప్రాంత కార్యదర్శి ఆనఘ వెంకట లక్ష్మి మహిళల పాత్ర దేశ అభివృద్ధిలో అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ప్రతి రంగంలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని, వారి ప్రతిభను గుర్తించి మరింత ముందుకు నడిపించాలని పిలుపునిచ్చారు. కుటుంబం,సమాజం,దేశం అనే ప్రతి దశలో మహిళల సేవలు అభివృద్ధి బాటను ప్రకాశవంతం చేస్తాయని పేర్కొన్నారు.పాలక మండలి సభ్యురాలు వల్లూరు అలివేలు మంగ పర్యావరణ రక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ఇంటి వద్ద నుంచి పర్యావరణ హిత చర్యలను అమలు చేయడమే భవిష్యత్తు తరాలకు ఇవ్వగలిగే గొప్ప కానుక అని ఆమె వ్యాఖ్యానించారు.చొప్పరి జయశ్రీ, వకుళాదేవి, లెక్కల రమ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. సభాధ్యక్షురాలిగా హాజరైన రామోజు ధనలక్ష్మి మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెరగాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఆచార్యబృందం, తల్లిదండ్రులు, విద్యార్థులకు ప్రధానాచార్య సముద్రాల రాజమౌళి కృతజ్ఞతలు తెలిపారు. నిర్వహణలో కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, మేచినేని దేవేందర్ రావు, కాటం రవీందర్, సిబ్బంది సమన్వయం చేశారు.

# అంజన్ కుమార్‌ను అభినందించిన అలయన్స్ క్లబ్స్ నేతలు

**నమస్తే ఇందూర్ ఇది కద నిజం:**
అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ 137%ూా% లీడర్లు తాజాగా కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వైద్యుల అంజన్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.ఈ సందర్భంగా నగరంలోని ప్రతి డివిజన్‌లో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. అలాగే అలయన్స్ క్లబ్స్ చేపట్టే సేవా కార్యక్రమాలకు భవిష్యత్తులో సహాయం అందించాలని అభ్యర్థించారు.కార్యక్రమంలో డా. ఎలగందుల శ్రీనివాస్, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎ.ఎ.సి.ఐ. జిల్లా గవర్నర్ అచీవర్స్ వెంకటేశ్వర్లు, జిల్లా క్యాబినెట్ సెక్రటరీ పులాల శ్యామ్, పండుగ నాగరాజు, జిల్లా పీఆర్ఓ విద్యాసాగర్ రెడ్డి, హైమవతి మహేష్, అడ్వకేట్ సుద్ధపల్లి ప్రసాద్, కుమారస్వామి, నాగేశ్వర్, గాలిపల్లి శ్రీనివాస్, అడ్వకేట్ నాజియా, అడ్వకేట్ రేణుక తదితరులు పాల్గొన్నారు.



# కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి చందు యాదవ్ డిమాండ్

**ఇది కద నిజం:**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండల కేంద్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కీలక సమావేశంలో రాబోయే సర్పంచ్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వివిధ కీలక నిర్ణయాలు తీసుకున్నారు.
ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గం బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఇంచార్జి వేల్పుల చందు యాదవ్ మాట్లాడుతూ, ప్రభుత్వం విడుదల చేసిన జీవో నం. 46 ను వెంటనే రద్దు చేయాలని గట్టిగా డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఇవ్వాల్సిన 42 శాతం రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్లో చేర్చి శాశ్వత రక్షణ కల్పించాలని సమావేశంలో తీర్మానించారు.అదేవిధంగా, బీసీలకు 42% రిజర్వేషన్ ఉంటే, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50% మించకూడదనే ప్రభుత్వ నిర్ణయాన్ని జేఏసీ తీవ్రంగా వ్యతిరేకించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన 42% బీసీ రిజర్వేషన్ల అమలులో విఫలమైందని, కామారెడ్డి డిక్లరేషన్‌ను సంపూర్ణంగా అమల్లోకి తీసుకురావాలని స్పష్టంగా డిమాండ్ చేశారు.జీవో 46 రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలంతా ఏకమై భారీ స్థాయిలో ధర్నాలు, రాస్తారోకాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నామనే హెచ్చరికను జేఏసీ నాయకులు ప్రకటించారు.సమావేశంలో పలువురు బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు పాల్గొని సంఘీభావం వ్యక్తం చేశారు.